బీఆర్‌టీఎస్ రయ్.. రయ్..

- తండ్రి హయాంలో ప్రారంభం.. కొడుకు హయాంలో కొలిక్కి
- గత ప్రభుత్వంలో రూ.32.57 కోట్లతో రోడ్డు విస్తరణ
- విస్తరణకు ముందు ఫుల్ ట్రాఫిక్.. విస్తరించాక ఫుల్ స్పీడ్
- పాదచారుల్ని భయపెడుతున్న వాహనాల వేగం

గత ఏడాది వరకు.. సింహాచలంలోని పాత గోశాల నుంచి అడవివరం కూడలికి వెళ్లాలంటే నిత్య నరకం. బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇరువైపులా రయ్ మంటూ దూసుకొచ్చే వాహనాలకు ఇక్కడ బ్రేకులు తప్పని సరి. రోజూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించలేక ట్రాఫిక్ పోలీసుల ఇక్కట్లు సింహాద్రి అప్పన్నకే ఎరుక. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ తిప్పలకు చెక్ పడింది. పీటీసీ–ఎస్‌టీసీలను అనుసంధానిస్తూ ఏళ్ల తరబడి విస్తరణకు నోచుకోని రోడ్డును విస్తరించారు. 99 శాతం పనులు గత ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. మిగిలిన ఒకటీ అరా పనులను కూటమి ప్రభుత్వం వచ్చాక పక్కన పెట్టేసింది.


తొలిపావంచా వద్ద రోడ్డు దాటుతున్న ప్రజలు

సింహాచలం: దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ(బీఆర్‌టీఎస్)లో భాగంగా పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్(పీటీసీ), సింహాచలం ట్రాన్సిట్ కారిడార్(ఎస్‌టీసీ) పనులు ప్రారంభమయ్యాయి. పాత అడవివరం నుంచి పాత గోశాల వరకు నిర్మాణాల తొలగింపునకు ఆటంకాలేర్పడ్డాయి. కోర్టు కేసుల కారణంగా దాదాపు రెండున్నర కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. యుద్ధ ప్రాతిపదికన నష్టపోయిన నిర్మాణాలకు పరిహారం, టీడీఆర్‌లు మంజూరు చేసి, అంతే వేగంగా రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. డివైడర్లు, ఫుట్‌పాత్‌లు, జీబ్రాక్రాసింగ్ తదితర చిన్నచిన్న పనులు మాత్రమే పెండింగ్. ఈలోగా ప్రభుత్వం మారిపోవడంతో ఆ పనులు అక్కడే ఆగిపోయాయి.

రోడ్డు దాటడం గగనమే..

బీఆర్‌టీఎస్ మార్గంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద పాదచారులు, భక్తులు రోడ్డు దాటాలంటే గగనంగా మారింది. విస్తరణ తర్వాత రోడ్డు దాటాలంటే 200 మీటర్లకు పైగా నడవాలి. సింహగిరి మెట్లమార్గంలోకి వెళ్లేందుకు, తొలిపావంచా వద్ద స్వామిని దర్శించుకునేందుకు భక్తులు రోడ్డు దాటుతుంటారు. ఈ ప్రాంతంలోనే చిరువ్యాపారులు ఉంటారు. వస్తువులు కొనుగోలు చేసే ప్రజలతో రద్దీ ఎక్కువ. ఈ రోడ్డులో వేగంగా ప్రయాణించే వాహనాలతో వారంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు మార్జిన్లు, డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఏ వాహనం ఎటు నుంచి వచ్చి ఎటు మళ్లుతుందో తెలియని పరిస్థితి. వరాహ పుష్కరిణి మార్గం నుంచి బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలోకి ప్రవేశించే వారికి కూడా ఇదే ఇబ్బంది.


విస్తరణకు ముందు అడవివరం ప్రధాన మార్గంలో ట్రాఫిక్ రద్దీ(ఫైల్)


విస్తరణ తర్వాత విశాలంగా మారిన రోడ్డు

మూడు రోడ్ల స్థానంలో రెండే..

బీఆర్‌టీఎస్ కారిడార్ నిబంధనల మేరకు మూడు రోడ్లుగా డివైడ్ చేయాలి. ఇక్కడ నిబంధనలకు తిలోదకాలిచ్చారన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల వరకు మూడు రోడ్లకే ప్రణాళిక ఉండేది. ఆ మేరకే కొన్నిచోట్ల మూడు రోడ్లకు మార్జిన్‌లు వేసి, డివైడర్‌లు కూడా నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్లాన్ మారిపోయింది. మార్గానికి ఇరువైపులా ఉన్న కొన్ని కల్యాణమండపాల యజమానులు, స్థానిక టీడీపీ నేతల ఒత్తిళ్లతో మూడు రోడ్లకు వేసిన మార్జిన్ కాస్తా రెండు రోడ్లకే పరిమితమయింది.

దీంతో ఓవర్ స్పీడ్‌తో పాటు ఓవర్‌టేక్‌లు కూడా పెరిగాయి. మరోవైపు కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ పనులపై ధ్యాసే లేదు.

తండ్రి ప్రారంభించారు.. కొడుకు పూర్తి చేశారు



దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన బీఆర్‌టీఎస్ కారిడార్ల విస్తరణ పనులు 15 ఏళ్ల తర్వాత ఆయన కుమారుడు గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కొలిక్కి వచ్చాయి. సింహాద్రి అప్పన్న తొలిపావంచా నుంచి పాత అడవివరం వరకు నివాసితుల నష్టపరిహారం విషయంలో కోర్టు కేసులతో విస్తరణ పనులు నిలిచిపోయాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ విషయం కొలిక్కి వచ్చింది. గత ఏడాది నవంబరులో రోడ్డుకి ఇరువైపులా కట్టడాలు తొలగించి విస్తరణకు మార్గం సుగమం చేశారు. రూ.32.57 కోట్లతో రోడ్డు పనులు చేపట్టారు. ఈ ఏడాది మే నెలలో చందనోత్సవం, జులైలో జరిగిన గిరి ప్రదక్షిణలను దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం రెండున్నర కిలోమీటర్ల మార్గం సువిశాలంగా మారింది. దీంతో ఇప్పుడు వాహనాల స్పీడ్‌కి కళ్లెం వేయలేని పరిస్థితి నెలకొంది. మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తుంటే పాదచారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పాత గోశాల కూడలి నుంచి పాత అడవివరం కూడలి వరకు ఉన్న మార్గంలో వాహనాల స్పీడ్ చూస్తుంటే భయం వేస్తోంది. వాహనాల స్పీడ్‌ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేయాలి. ముఖ్యంగా కుమ్మరిదిబ్బ, తొలిపావంచా, ఆర్టీసి కాంప్లెక్స్, గోశాల ఏరియాల్లో స్పీడ్ బ్రేకర్లు ఖచ్చితంగా ఉండాలి. లేకుంటే ప్రమాదాలు తప్పవు.

– బి.కృష్ణారెడ్డి, అడవివరం

మూడు రోడ్లుగా విభజించాలి



మూడు రోడ్లను రెండుగా చేయడం సరికాదు. బీఆర్‌టీఎస్ రోడ్డు నిబంధనల ప్రకారం మూడు విభాగాలుగానే ఉండాలి. ఆ ప్రణాళికలను మార్చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మూడు రోడ్లుగా విభజించాలి. వేపగుంట నుంచి పాత గోశాల, పాత అడవివరం నుంచి హనుమంతవాక వరకు మూడు రోడ్లుగానే ఉన్నాయి.

– కర్రి అప్పలస్వామి, అడవివరం

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 4 అర్జీలు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 4 వినతులు అందాయి. 97వ వార్డు పురుషోత్తపురంలో రోడ్డు ఆక్రమణపై, 92వ వార్డు నరసింహనగర్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని, 89వ వార్డు ఎస్సీ, బీసీ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని, 98వ వార్డు అడవివరంలో కాలువల సమస్య పరిష్కరించాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు విశేషంగా తిరువీధి


తిరువీధిలో అమ్మవార్లకు హారతి అందజేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేశారు. నాదస్వర వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణలతో బేడా తిరువీధిని నిర్వహించారు. విశేష హారతి అందించారు.

పెరిగిన తుప్పలు.. ప్రయాణికుల తిప్పలు


ముత్యాలమ్మపాలెం–తంతడి రోడ్డులో ఏపుగా పెరిగిన తుప్పలు

పరవాడ: మండల పరిధిలో ముత్యాలమ్మపాలెం–తంతడి రోడ్డులో ఏపుగా పెరిగిన తుప్పలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, పొదలు దట్టంగా పెరిగాయి. దీంతో మలుపుల వద్ద సమీపంలోకి వచ్చే వరకూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపుల దట్టంగా పెరిగిన తుప్పలను తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవట్లేదని స్థానికులు చెప్తున్నారు. దట్టంగా పెరిగిన తుప్పల కారణంగా పాములు, విషపురుగులు, జంతువులు తిష్టవేయడంతో రాత్రి వేళ కాలినడకన రాకపోకలు సాగించే ప్రయాణికులు భయపడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి రోడ్డుకు ఇరువైపుల పెరిగిన తుప్పలను తొలగించాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టరూ..


మరమ్మతులకు గురైన వెంకటపతిపాలెం మంచి నీటి ట్యాంకు

పరవాడ: మండలంలో గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న సంకల్పానికి నిర్వహణ లోపాలు తూట్లు పొడుస్తున్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకు మరమ్మతులకు గురైంది. నీరు వృథాగా పోతోంది. ట్యాంక్ పిల్లర్లు పెచ్చులూడి, నలువైపులా ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. వాటర్ ట్యాంక్ గోడలు కూడా దెబ్బతిన్నాయి. శ్లాబుకు బీటలు వారి నీరు చిమ్ముతోంది. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినీ వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టేలా అధికారులు చొరవచూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

సబ్బవరం: సభ దృష్టికి ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై నమ్మకం పెరుగుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులంతా ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాల్సి ఉందన్నారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో దసరా తరువాత వీర్వోలతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. మండలంలోని పలు రోడ్లతో పాటు సబ్బవరం పీహెచ్‌సీ రోడ్డు, ఆస్పత్రిలోని మిగిలిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ఎంపీపీ తీసుకెళ్లారు. దీంతో ఆస్పత్రి పునర్నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కొందరు అధికారులు సమావేశానికి ఆలస్యంగా రావడంతో అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయం, ఉపాధి పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ లభ్యత సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇసుక, గ్రావెల్‌కు అనుమతులు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా మండలానికి బదిలీపై వచ్చిన ఉద్యోగుల పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం మండల పరిషత్ అవరణలో రూ.25 లక్షల జాతీయ అవార్డు ప్రోత్సాహక నిధులతో నిర్మించిన సమావేశ మందిరం అదనపు అంతస్తును ప్రారంభించారు. వైస్‌ఎంపీపీలు దాడి ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, ఎంపీడీవో పద్మజతో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంజేపీ విద్యార్థులు


యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పరవాడ: రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు వేదికగా సోమవారం ముగిసిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మండలంలోని తానాం ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆయా పోటీల్లో కె.వెంకట వైష్ణవి, కె.భావన, కె.ధనలక్ష్మి, బి.భావన, ఎస్.కౌశిక, ఎల్.భవంతి, డి.హర్షిత, బి.వైష్ణవి స్వర్ణపతకాలు సాధించారు. వీరంతా నవంబర్ 18–22 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ కర్నూల్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

మాజీ సర్పంచ్ పైడిరాజుకు ఘన నివాళి


పైడిరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు

సబ్బవరం: 88వ వార్డు వెదుళ్ల నరవ మాజీ సర్పంచ్ సారిపల్లి పైడిరాజు లేని లోటు పూడ్చలేనిదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన పైడిరాజు పెద్దకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి పైడిరాజు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. అదీప్‌రాజ్ వెంట మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, మాజీ సర్పంచ్ మోపాడ అప్పారావు, పార్టీ సీనియర్ నాయకులు బొర్రయ్య, కాపుశెట్టి శేషుబాబు, బొన్ని నాయుడు, దనవరెడ్డి శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.1.40 లక్షల జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మంది మందుబాబులకు రెండవ ప్రత్యేక జ్యుడీషియల్ కోర్టు జడ్జి రూ.1.40 లక్షల జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ విభాగం ఎస్ఐ నరసింహరాజు తెలిపారు.

గత కొద్దిరోజులుగా పెందుర్తి పరిసర ప్రాంతాల్లో జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.


శ్రీ లలితా.. కరుణాంతరంగితా!

'ల కార రూపా లలితా! లక్ష్మీవాణి నిషేవితా!'.. లక్ష్మీ, సరస్వతుల సేవలందుకునే లలితాదేవిని శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం వివిధ ఉపచారాలతో భక్తులు పూజించారు. స్తోత్రాలు, సహస్ర నామాలతో కొలిచారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన రోజుల్లో ఆశ్వీయుజ శుద్ధ పంచమి ఒకటి. ఈ రోజు దుర్గమ్మను లలితా త్రిపురసుందరిగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో కొలిచారు. కొన్నిచోట్ల అమ్మవారిని మహాలక్ష్మి, మహిషాసుర మర్ధిని, రజత కవచాలంకృత దుర్గమ్మ, అన్నపూర్ణ, సంతానలక్ష్మిగా అలంకరించి పూజించారు.

- ఘనంగా ఐదోరోజు శరన్నవరాత్రి ఉత్సవాలు
- లలితా త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి
- పలు చోట్ల మహాలక్ష్మి, మహిషాసుర మర్ధిని, అన్నపూర్ణ, సంతానలక్ష్మిగా పూజలు


ఎస్ఆర్ పురంలో మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ


సుజాతనగర్లో రజత కవచాలంకృత దుర్గాదేవిగా..


శ్రమశక్తినగర్‌లో అన్నపూర్ణగా పంచముఖ గాయత్రీదేవి


పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో లలితాదేవిగా..


మహాలక్ష్మిగా.. దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరి


సప్తగిరినగర్‌లో సంతానలక్ష్మిగా అలివేలు మంగమ్మ


మహాకామేశ్వరి మందిరంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి ప్రాంతంలోని అమ్మవార్ల ఆలయాల్లో, ఉత్సవ మండపాల్లో సోమవారం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారా ల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన జరిపారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అన్నపూర్ణదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. ప్రసాద వితరణ చేపట్టారు.
- సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీఎత్తున కుంకుమ పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. సంతానలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.
- ప్రశాంతినగర్‌లోని కనకదుర్గమ్మ లలితాదేవి అవతారంలో పూజలందుకున్నారు. సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని రజత కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.
- 95వ వార్డు చీమలాపల్లిలోని వేదమాత గాయత్రి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరంలోని సింహాద్రి అప్పన్న తొలిపావంచా వద్ద హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారు మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో ఉదయం గోపూజ, చండీ హోమం, శ్రీ చక్రార్చన ఘనంగా నిర్వహించారు.

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సహస్రాక్షి అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. కామాఖ్య పీఠంలో భక్తులు అమ్మవారికి తమ క్షీరాభిషేకం, సామూహిక కళావాహన పూజలు జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కంచి కామకోటి పీఠ ఆస్థాన విద్వాంసులు ప్రాతా కృష్ణమూర్తి కర్ణాటక సంగీత కచేరీ ఆకట్టుకుంది.

లలితా త్రిపుర సుందరిగా రాజశ్యామల


లలితా త్రిపుర సుందరి అవతారంలోని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వామీజీలు

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడలోని శారదాపీఠంలో ఐదోరోజు సోమవారం లలితా త్రిపుర సుందరిదేవిగా శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల చేతుల మీదుగా అమ్మవారికి పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమ పూజ, సువాసిని పూజల్లో మహిళలు పాల్గొన్నారు. శ్రీచక్రానికి పూజలు చేశారు. అమ్మవారికి స్వామీజీ చేతుల మీదుగా ఏకాదశ హారతులిచ్చారు.